



అల్లూరి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

స్ఫూర్తినీయం అల్లూరి జీవితం

కలెక్టరేట్‌లో జయంతి కార్యక్రమం - పలువురి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్వాతంత్య్ర పోరాటంలో చిన్నతనంలోనే బ్రిటీష్ పాలకులను ఎదురించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు స్ఫూర్తినీయంగా నిలుస్తుందని పలువురు, అధికారులు ప్రజాప్రతినిధులు తెలియజేశారు. జిల్లా గిరిజన సంక్షేమ, పర్యటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఎంపి అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ తదితరు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అన్నది ఒక పేరు కాదని అది ఒక సమూహ శక్తి, స్వతంత్ర సంగ్రామ భేరి అన్నారు. తెల్లవారి బానిస సంకెళ్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరుడు సీతారామరాజు అన్నారు. మన్యం ప్రాంతంలో గిరిజనులు సమీకరించి బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశారన్నారు. దేశ స్వాతంత్రం కోసం తన ప్రాణాలను సైతం అర్పించిన గొప్ప వీరుడన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, డీఆర్వో మలోలా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామాంజనేయులు, పర్యాటకశాఖ అధికారి జయ కుమార్‌తో పాటు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు అధికారులు పాల్గొన్నారు.



బోధించే వారేరి..?

- చరిత్ర ఘనం... చచ్చుబడిన బోధనం..!
- శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల కరువు
- 16 శాతం మందే బోధకులు
- ఎనిమిది విభాగాల్లో పూర్తిగా ఖాళీ

అనంతపురం జిల్లాలో విద్యాభివృద్ధిలో భాగంగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా ఈ యూనివర్సిటీకి ఘనమైన చరిత్ర ఉంది. ఇందులో చదువుకున్న వారెందరో దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డారు. ఇదంతా గతం.. ఇప్పుడు యూనివర్సిటీ పరిస్థితే మారిపోయింది. విద్యార్థులకు బోధించే అధ్యాపకులు లేక చాలా విభాగాలు ఖాళీగా ఉన్నాయి. అధ్యాపకుల్లేక క్రమక్రమంగా విద్యాబోధన చచ్చుబడిపోతోంది. ఏళ్ల తరబడి తాత్కాలిక బోధకులతోనే నెట్టుకొచ్చే పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే పరిస్థితి మరికొంత కాలం కొనసాగితే ఉన్నత విద్య అటకెక్కే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తుండటం విచారకరం.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఘనమైన చరిత్ర ఉంది. అనేక మంది రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు ఇక్కడ చదువుకున్న వారే ఉన్నారు. 1967లో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అనుబంధంగా పోస్టు గ్రాడ్యుయేషన్ కేంద్రంగా ఏర్పాటైంది. 1976 నాటికి అది అటానమస్ కాలేజీగా ఏర్పాటైంది. ఆ తరువాత 1981లో యూనిటరీ యూనివర్శిటీగా ఏర్పాటైంది. 1988 నుంచి పూర్తి స్థాయి విశ్వవిద్యాలయంగా మారింది. అప్పటి నుంచి అంచెలంచెలుగా విశ్వవిద్యాలయం విస్తరణ సాగుతూనే వచ్చింది. ప్రస్తుతం దీని పరిధిలో 13 ఆర్ట్స్ డిపార్టుమెంట్లు ఉండగా, 16 సైన్స్ డిపార్టుమెంట్లు ఉన్నాయి.

16 శాతమే అధ్యాపకులు

సుదీర్ఘమైన చరిత్ర కలిగిన శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల కొరత తీవ్రంగా ఉంది. సాధారణంగా అయితే ప్రతి డిపార్టుమెంట్‌కు ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. ప్రతి డిపార్టుమెంట్‌కు ఏడుగురుకు సిబ్బంది ఉండాలి. ఈ ప్రకారం 29 డిపార్టుమెంట్లకు కలిపి 203 మంది ఉండాలి. ప్రస్తుతం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో మొత్తం కలిపి 33 మంది మాత్రమే ఉన్నారు. అంటే 16 శాతంలోపే బోధనా సిబ్బంది యూనివర్సిటీలో ఉన్నారు.

ఎనిమిది డిపార్టుమెంట్‌ల్లో ఒక్కరూ లేరు..!

విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 29 డిపార్టుమెంట్‌లు ఉంటే అందులో ఎనిమిది డిపార్టుమెంట్లకు ఒక్కరు కూడా బోధనా సిబ్బంది లేకపోవడం గమనార్హం. సోషియాలజీ, హిస్టరీ, పాలిమర్ సైన్స్, జువాలజీ, ఎంఇడి, హిందీ, మైక్రో బయాలజీ, సెరికల్చర్ విభాగాలకు అధ్యాపకులు ఒక్కరూ లేరు. 13 డిపార్టుమెంట్లకు ఒకరు చొప్పున ఉన్నారు. తొమ్మిది డిపార్టుమెంట్లకు ఇద్దరు నుంచి ముగ్గురున్నారు. మొత్తంగా 203 మంది ఉండాల్సిన చోట కేవలం 33 మంది మాత్రమే ఉన్నారు.



తాత్కాలిక సిబ్బందే దిక్కు

యూనివర్సిటీలో బోధనా సిబ్బంది పెద్దఎత్తున ఖాళీలుండగా ఆ స్థానాల్లో తాత్కాలిక సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. ఉన్నతమైన విద్యను బోధించే తాత్కాలిక సిబ్బంది కూడా సరైన వేతనం లేదు. అకడమిక్ కన్సల్‌టెన్సీల పేరుతో గంటకు రూ.500 చొప్పున వేతనమిచ్చి తరగతులను కొనసాగిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాల్లోని అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయకపోవడంతోనే ఇంత పెద్దఎత్తున ఖాళీలు ఏర్పడ్డాయని విద్యావేత్తలు చెబుతున్నారు. వీటిని భర్తీ చేస్తామని గత వైసిపి ప్రభుత్వం గొప్పగా ప్రకటించించింది. తర్వాత న్యాయస్థానం చిక్కులు చూపించి భర్తీ చేయలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే తీరులో నడుస్తుండటం గమనార్హం.

పిహెచ్‌డి చేయాలన్నా కష్టమే

బోధనా సిబ్బందిని నియమించకుండా ఇదే పరిస్థితి కొనసాగితే ఎస్‌కెయులో పిహెచ్‌డి పట్టా పొందాలన్నా రాబోయే రోజుల్లో గగనమయ్యే పరిస్థితులు నెలకొననున్నాయి. పిహెచ్‌డి పొందాలంటే ప్రొఫెసర్లు గైడ్ చేయాల్సి ఉంటుంది. యూనివర్సిటీలో ప్రొఫెసర్లే లేకపోవడంతో విద్యార్థులు ఎవరి ఆధ్వర్యంలో పూర్తి చేయాలన్న సమస్య వచ్చే అవకాశముంది. గతేడాది ఉర్దూకు ఇదే రకమైన సమస్య రావడంతో దానికి సంబంధించి పిహెచ్‌డి నోటిఫికేషన్ లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం స్పందించి ఎస్‌కె యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అన్ని అధ్యాపక పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, మేధావులు కోరుతున్నారు.

కెజిబివి విద్యార్థినులకు అస్వస్థత

పాపిరెడ్డిపల్లి కెజిబివిలో ఘటన



అస్వస్థతకు గురైన పాపిరెడ్డిపల్లి కెజిబివి విద్యార్థినులు

శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండల పరిధిలోని పాపరెడ్డిపల్లి కస్తూరిభా గాంధీ బాలిక పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌తో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం రాత్రి అన్నం, సాంబారు, రసం తిన్న అనంతరం విద్యార్థినులు వాంతులు విరోచనాలకు గురయ్యారు. స్పందించిన పాఠశాల సిబ్బంది వారికి వైద్య చికిత్సలు అందించే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీరందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. విద్యార్థినుల అస్వస్థత విషయం తెలుసుకున్న రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత పాఠశాలకు వెళ్లి విద్యార్థినులను పరామర్శించారు. అందరికీ మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

వార్త మెయిన్‌లో

మహిళా సమస్యలపై ఐక్య ఉద్యమాలు

- అత్యాచారాలు, హత్యలు నివారించడంలో ప్రభుత్వాలు విఫలం
- ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి
- అనంతలో ఘనంగా నగర మహాసభలు



ఐద్వా జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'76 ఏళ్ల స్వాతంత్ర్యంలోనూ మహిళలు వివక్షకు గురవుతున్నారు. హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. దీనిపై ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కొనసాగుతూనే ఉంది. ఈ పరిస్థితులలోల మహిళల రక్షణ,. సామాజిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలే మార్గం.' అని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి పిలుపునిచ్చారు. ఐద్వా అనంతపురం నగర కమిటీ 8వ మహాసభలను శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించారు. ఐద్వా వ్యవస్థాపకుల్లో ఒకరైన మానికొండ సూర్యవతి వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన మహాసభల్లో నగరంలోని ఐద్వా నాయకులు పాల్గొన్నారు. సీనియర్ నాయకురాలు రామాంజినమ్మ ఐద్వా జెండాను ఆవిష్కరించారు. మానికొండ సూర్యవతి చిత్రపటానికి మహిళా నేతలు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సావిత్రి మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో రోజురోజుకూ మహిళలపై హింస పెరుగుతోందన్నారు. ప్రతి గంటకూ ఒక మహిళా హింసకు, అత్యాచారానికి, హత్యకు గురవుతున్న దౌర్భాగ్య దుస్థితి ఉందన్నారు. రాష్ట్రంలో వరుసగా అమనుష ఘటనలు చోటు చేసుకోవడం శోచనీయం అన్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు పాలకులు హడావిడిగా బాధితుల పక్షాన మాట్లాడి మిన్నకుండి పోవడం పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి పద్ధతిని మార్చేలా మహిళల మాన, ప్రాణ, హక్కుల రక్షణకు ఐద్వా ఆధ్వర్యంలో సంఘటిత ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. కలిసి వచ్చే వారితో ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలన్నారు. మహాసభల సందర్భంగా మూడు తీర్మానాలను ప్రవేశపెట్టారు. 'సమాజంలో మానసిక హింసకు గురి చేస్తున్న మైక్రో ఫైనాన్స్ ఆగడాలను నిర్మూలించి ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు నిర్మూలించాలి. సోషల్ మీడియాలో విచ్చలవిడిగా మహిళా హక్కులకు భంగం కలిగించే వికృత చర్యలు నిర్మూలించాలి'. ఈ తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కోశాధికారి చంద్రిక, సీనియర్ నాయకురాలు రామాంజినమ్మ, రేవతి, సభ్యులు పాల్గొన్నారు.

ఐద్వా నగర నగర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.శంషాద్, కె.అశ్విని

మహాసభల సందర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అనంతపురం నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా నగర అధ్యక్షులుగా ఎస్.శంషాద్, నగర ప్రధాన కార్యదర్శిగా కె.అశ్విని, కోశాధికారిగా గీత, ఆఫీస్ బేరర్స్‌గా పద్మా, శైలజ, లక్ష్మి, వహిదా, పర్యాబి, తులసిలతో పాటు 9 మంది ఆఫీస్ బేరర్స్, మొత్తం 26 మందితో నగర కమిటీని ఎన్నుకున్నారు.

రూ.5 కోట్ల నిధులు విడుదల చేయాలి

శ్రీరామిరెడ్డి కార్మికులకు బకాయిలు చెల్లించి సమ్మెను విరమింపజేయండి - సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న శ్రీరామిరెడ్డి సరఫరా తాగునీటి కార్మికులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ నిధులు రూ.5 కోట్లు విడుదల చేసి సమస్య పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం 90వ రోజుకు చేరుకుంది. సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరుతూ కార్మికులు, సిఐటియు నాయకులు కళ్యాణదుర్గం నుంచి ఈ నెల 2వ తేదీన చేపట్టిన పాదయాత్ర కలెక్టరేట్‌కు చేరుకుంది. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టరేట్ గేటు ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు మాట్లాడుతూ కార్మికులు చేసిన పనికి వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం, కాంట్రాక్టర్‌లు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా ఉందన్నారు. కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ కృషి మేరకు కొంత నిధులు విడుదలైన మాట వాస్తవమే అని, అయినా అవి పాక్షికమే అన్నారు. ప్రజలకు శాశ్వత అవసరాల పనులకు శాశ్వత నిధులు కేటాయించి ఖర్చు చేయాల్సిన ప్రభుత్వాలు తీవ్ర అలసత్వం వహిస్తూ కార్మికులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం వైఖరి మార్చుకుని శ్రీరామిరెడ్డి కార్మికులకు బకాయి వేతనాలు, పిఎఫ్ చెల్లించాలన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో స్కీం వర్కలకు ఖచ్చితమైన నిధులు కేటాయించి వాటి కోసమే ఖర్చు చేయాలని కోరారు. ఫేజ్-1 పిఎబిఆర్ హిందూపురం వరకు ట్రంక్‌లైన్ కార్మికులకు 6 నెలల వేతనాలు, 26 నెలల పిఎఫ్ చెల్లించాలన్నారు. హిందూపురం పరిగి కార్మికులకు 15 నెలల వేతనాలు, పిఎఫ్ బకాయిలు చెల్లించాలన్నారు. బెళుగుప్ప మండలం కార్మికులకు 9 నెలల వేతనాలు, 40 నెలల పిఎఫ్ చెల్లించాలన్నారు. మడకశిర కార్మికులకు 3 నెలల వేతనాలు, 36 నెలల పిఎఫ్ చెల్లించాలన్నారు. పూర్తి స్థాయిలో బకాయిలన్ని చెల్లించి సమ్మెను విరమింపజేయాలని కోరారు. కార్మికుల పాదయాత్రకు మద్దతుగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు ఎటిఎం.నాగరాజు, సిఐటియు నగర కార్యదర్శి ముత్తుజా, ఐఎఫ్‌టియు కార్యదర్శి ఏసురత్నం, ఎఐటియుసి నాయకులు సి.రామక్రిష్ణ, రైతు కూలీ సంఘం నాయకులు హనుమంతరాయుడు, వైఎస్ఆర్‌టియు ఓబిరెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి కార్మికుల యూనియన్ అధ్యక్షులు ఆర్.ఎర్రిస్వామి, కార్యదర్శి జి.రాము, కోశాధికారి హెచ్.వన్నూర్‌స్వామి, ప్రభాకర్, రామాంజనేయులు, సోము, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోగులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కుందుర్పి : రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ గంగాధర్‌రెడ్డి వైద్యులు, సిబ్బందిని హెచ్చరించారు. ఆయన శుక్రవారం స్థానిక పిహెచ్‌సిని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఆయన వెంట డాక్టర్ తరుణ్‌సాయి, సిహెచ్‌ఒ ముంతాజ్ బేగం, సూపర్వైజర్ ప్రకాష్, స్టాఫ్ నర్స్ అమృత, మధుబాబు ఉన్నారు.

నేడు బిటిపి కాలువ పనులు ప్రారంభం

బ్రహ్మసముద్రం : కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల జీవనాడి అయిన బిటిపి ప్రాజెక్టు పూడికతీత పనులను ఏడేళ్ల తర్వాత పున్ణప్రారంభించడం హర్షణీయమని టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు పేర్కొన్నారు. బ్రహ్మసముద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ శనివారం సాయంత్రం మండలంలోని పొబ్బర్లపల్లి గ్రామం వద్ద బిటిపి కాలువ పూడికతీత పనులను పున:ప్రారంభిస్తారన్నారు. ఆ కార్యక్రమంలో రైతులు, టిడిపి శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు.

కోనాపురంలో చిన్నారుల 'ఆరోగ్య స్క్రీనింగ్'

బ్రహ్మసముద్రం : చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో మరో మైలురాయి ఆరోగ్య స్క్రీనింగ్ అని ఆర్‌బిఎస్‌కె, ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి పేర్కొన్నారు. మండలంలోని కోనాపురం గ్రామంలో శుక్రవారం సర్పంచి మల్లెల వనిత సహకారంతో వైద్య ఆరోగ్య, మహిళ, శిశు సంక్షేమ, సమగ్ర శిశు అభివృద్ధి, విద్య, ఇతర అనుబంధ శాఖల సహకారంతో ఆరోగ్య స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర వైద్య పరిశీలన చేపట్టారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేంద్ర, సుమన గోపీచంద్, చంద్రశేఖర్, సుప్రియ, ప్రియాంక, విజ్ఞ, శివప్రసాద్, నాగభూషణం, ఎంఎల్‌హెచ్‌పిలు సల్మా, లక్ష్మి, సాయిమౌనిక, నాగమణి, హెల్త్ అసిస్టెంట్స్ జాన్సన్, ఆనంద్, ప్రతాప్‌రెడ్డి, ఎఎన్‌ఎంలు నిర్మల, వరలక్ష్మి, మహాలక్ష్మి, ఆశా కార్యకర్తలు గీత, తిప్పక్క, శివమ్మ, నాగరత్నమ్మ నాగవేణి, చాముండి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బిటిపికి కృష్ణా జలాలు తీసుకొస్తాం : ప్రభుత్వ విప్



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బైరవాణి తిప్ప ప్రాజెక్టు(బిటిపి)కు కృష్ణా జలాల తరలింపు ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. పట్టణంలో శుక్రవారం ఆయన జల వనరుల శాఖ అధికారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వైసిపి పాలనలో ఆగిపోయిన జీడిపల్లి-బైరవానితిప్ప పనులను శనివారం పున్ణ ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంత రైతులకు ఈ ప్రాజెక్టు ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. గత టిడిపి పాలనలో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి చంద్రబాబు రూ. 968 కోట్లు మంజూరు చేశారని గుర్తు చేశారు. 2019 నాటికి టిడిపి పాలనలోనే దాదాపు 30 శాతం పనులు పూర్తి చేశామన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఆగిన పనులను తిరిగి ప్రారంభించి త్వరగా పూర్తి చేయించడానికి తాను, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఆయనతో పాటు జల వనరుల శాఖ ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్, హంద్రీనీవా సుజల స్రవంతి చీఫ్ ఇంజినీర్ నాగరాజు ఉన్నారు.

'పోలవరం-బనకచర్ల'పై మాట్లాడే హక్కు వైసిపికి లేదు

రాయదుర్గం : 'సుపరి పాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పట్టణంలోని 18వ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి హయాంలో జగన్, పెద్దిరెడ్డి సీమ సాగునీటి ప్రయోజనాలను కాల రాసి వేల కోట్ల ప్రజాధనాన్ని దోపిడీ చేశారన్నారు. తన వారికి కాంట్రాక్టులు అప్పగించాలనే దురుద్దేశంతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారని విమర్శించారు. వీరికి పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు, కృష్ణా, గోదావరి అనుసంధానంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ ప్రశాంతి, ఉమ, హనుమంతు, పురుషోత్తం, సుమలత, వెంకటేశులు, టిడిపి పట్టణ అధ్యక్షుడు నాగరాజు, వేణు, తిప్పేస్వామి, శంకర్ ఉన్నారు.

పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకే పి-4

రాయదుర్గం రూరల్ : పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకే ప్రభుత్వం పి-4 విధానాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ కొండన్న ఆధ్వర్యంలో నియోజకవర్గ విజన్ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారిని గుర్తించడం, సంపన్నుల చేత చిన్నపాటి పెట్టుబడులు పెట్టించడం, ఇతరత్రా వాటికి ఆర్థిక సాయం చేయించడమే పి-4 ముఖ్య ఉద్దేశం అన్నారు. దాతృత్వం కలిగిన వారు, సంపన్నులను గుర్తించి పి-4 విధానాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. 2027 నాటికి చేయాల్సిన పనులు, 2029 నాటికి సాధించాల్సిన లక్ష్యాలతో తహశీల్దార్లు, ఎంపిడిఒలు ప్రణాళికాబద్ధంగా సమన్వయంతో ప్రగతి దిశగా పని చేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ నాగరాజు, కమిషనర్ దివాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, గుమ్మఘట్ట, బొమ్మనహాల్, డి.హీరేహాల్, కణేకల్లు మండలాల తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆవులదట్లలో ఎమ్మెల్యే పర్యటన

'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మండలంలోని ఆవులదట్ల గ్రామంలో పర్యటించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ హనుమంతు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పి-4 అర్హులకు న్యాయం చేద్దాం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాష్ట్రంలో పేదరికం నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇది వరకే సర్వే చేసి గుర్తించిన పబ్లిక్ ప్రయివేటు పీపుల్ పాట్నర్‌షిప్ (పి-4) అర్హులకు న్యాయం చేద్దామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. పట్టణంలోని ప్రజావేదిక కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే ఆర్డీవో వసంతబాబుతో కలిసి డివిజినల్, మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వేలో ఎలాంటి ఆదాయ వనరులు లేని పేద కుటుంబాలు సుమారు 10వేల దాకా ఉన్నట్లు గుర్తించా మన్నారు. మొదటి దశగా 1500 నుంచి 2000 కుటుంబాలకు ఆర్థిక పరిపుష్టిని అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తునామన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, అగ్రికల్చర్ ఎడి యల్లప్ప, తహశీల్దార్లు భాస్కర్, సుమతి, ఈశ్వరమ్మ, సిడిపిఒ ప్రసన్న, వైద్యాధికారి ప్రసన్నభారతి, ఎంఇఒ విజయకుమారి, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

కుందుర్పి : ప్రభుత్వం మారినా అధికారులు తీరు మారలేదని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఎనుములదొడ్డి పంచాయతీలో శుక్రవారం టిడిపి మండల కన్వీనర్ ధనుంజయ అధ్యక్షతన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏడాది పాలనలో అభివృద్ధి పనులు, హామీలు, సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలకు వివరించారు. గత వైసిపి ప్రభుత్వం చేసిన అవినీతి, అనైతిక పాలనకు సహకరించిన అధికారులు ప్రభుత్వం మారిందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఇకనైనా పనితీరు మార్చుకుని మెరుగైన సేవలు అందించాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు కనకదాసు, వాల్మీకి విగ్రహాలకు పూలమాలలు వేశారు.

తహశీల్దార్ లేక ప్రజలకు ఇబ్బందులు



తహశీల్దార్ కార్యాలయం

ప్రజాశక్తి-పుట్లూరు

మండలానికి తహశీల్దార్ లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పని చేసే తహశీల్దార్ బదిలీ అయి 20 రోజులు అవుతోంది. ఇప్పటికీ మండలానికి తహశీల్దార్‌ను నియమించకపోవడం బాధాకరం. వేసవికాలం అనంతరం పాఠశాలలు, కళాశాలలు ప్రారంభమయాయి. దీంతో విద్యార్థులకు ఎక్కువగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అవసరం. అయితే తహశీల్దార్ లేకపోవడంతో విద్యార్థుల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఒత్తిడి చేస్తున్నారు. దీంతో చాలామంది విద్యార్థులు రోజూ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వీరికితోడు పలువురు రైతులు రెవెన్యూ సమస్యలపై వస్తూ వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలానికి తహశీల్దార్‌ను నియమించి విద్యార్థులు, రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్


బుక్‌లెట్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, హమాలీలు

ప్రజాశక్తి-అనంతపురం

ఈనెల 9వతేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, నగర అధ్యక్షులు వై.వెంకటనారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం నగరంలో సిటీ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన బుక్‌లెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రవాణా రంగంలో లోడింగ్, అన్‌లోడింగ్ పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులందరికీ సమగ్ర చట్టం చేయాలన్నారు. దీంతోపాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. అదేవిధంగా ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి 9న జరిగే సార్వత్రిక సమ్మెలో అసంఘటిత రంగ కార్మికులైన హమాలీలందరూ పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిటీ హమాలీ యూనియన్ నాయకులు ఆదినారాయణ, నర్సింహులు, నాగశేషు, గౌరప్ప, కుళ్లాయప్ప, రాజన్న, రామాంజనేయులు, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి సీతారామరాజుకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడంతోపాటు గిరిజనులకు అండగా నిలిచిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని రిజిస్ట్రార్ ఎస్.క్రిష్ణయ్య కొనియాడారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని జెఎన్‌టియులో ఉన్న పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చిన్నప్పటి నుంచే దైవ భక్తి, నాయకత్వ లక్షణాలు, దాన గుణం అధికంగా ఉండేవన్నారు. మన్యంవాసుల కష్టాలను కడతేర్చటానికి, తెల్లదొరల దోపిడీని ఎదుర్కోవడానికి గిరిజనులకు అండగా నిలిచిపోరాటం చేశారని గుర్తు చేశారు. అంతేగాకుండా భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయనలోని విశిష్ట వ్యక్తిత్వం, ధైర్య గుణం, సమయపాలన, నీతి, నిబద్ధతను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్ భానుమూర్తి, ఎస్‌వి సత్యనారాయణ, వైశాలి ఘోర్పడే, జివి సుబ్బారెడ్డి, పద్మ సువర్ణ, ఆర్.కిరణ్మయి, నాగప్రసాద్‌నాయుడు, విబి చిత్ర, ఎపి శివకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, భువన విజయ, ఎం.అంకారావు, శ్రీధర్, జె.శ్రీనివాసులు, పిఆర్ఓ బి.ఓంప్రకాష్, బోధన, బోధనేతర, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

శింగనమల : అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పారిశుధ్య కార్మికులను శుక్రవారం ఘనంగా సత్కరించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం కార్మికులను సన్మానించడంతోపాటు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సూర్యప్రతాప్, విఆర్ఓ తాతయ్య, అఖిల భారత రైతు కూలీ సంఘం మండలం జిల్లా కమిటీ సభ్యుడు తరిమెల రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి నాగరాజు, సహాయ కార్యదర్శి కృష్ణ, మండల కమిటీ సభ్యులు లక్ష్మీరంగయ్య, బూసి, ముని, శ్రీరాములు, గార్లదిన్నె మండల కార్యదర్శి రాజశేఖర్, కమిటీ సభ్యులు ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు : మండలంలోని మైనార్టీలు సబ్సిడీ రుణల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ అలివేలమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్లూరు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రెండు, ఎ.కొండాపురం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఒకటి చొప్పున రుణాల యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.

మండల కన్వీనర్‌ను కలిసిన వైసిపి నాయకులు

పుట్లూరు : నూతనంగా ఎంపికైన మండల కన్వీనర్ మహేష్‌రెడ్డిని సూరేపల్లి వైసిపి నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి నబిరసూల్, మాజీ సర్పంచు మోహన్, ఎర్రిస్వామి, రవినాథ్, రాజకుళ్లాయప్ప, రఫీ, గురుప్రసాద్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

6న రేబిస్ టీకాలు వేస్తాం

బుక్కరాయసముద్రం : పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన ప్రపంచ జూనోసిస్ దినోత్సవం నిర్వహించనున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలయకులు ఎవి రత్నకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుక్కరాయసముద్రం ప్రాంతీయ పశు వైద్యశాలలో పెంపుడు, వీధి కుక్కలకు ఉచితంగా రేబిస్ నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. కుక్కలకు టీకాలు వేయించుకోవాలని తెలియజేశారు.

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

యాడికి : మండల వ్యాప్తంగా నిరుద్యోగ యువతకు అదానీ గ్రూప్ కంపెనీ వారు మూడు నెలల శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నటు ఎంపిడిఒ వీర్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న యువకులు మండల పరిషత్ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎరుకల సేవాసంఘం మండల కమిటీ ఎన్నిక

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాస చక్రవర్తి ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి కోలగుండ్ల శేఖర్, నియోజకవర్గ అధ్యక్షుడు సాకే వసంత్, కులపెద్దలు సమక్షంలో శుక్రవారం విడపనకల్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఎరుకల ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా హనుమంతు, కరక ముక్కల భీమ్, శేఖర్, గడేకల్ వై.శేఖర్, మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి సతీష్, కార్యదర్శులుగా వైశ్యకుమార్, ఓబులేసు, కిష్టప్ప, సెక్రటరీలుగా కుళ్లాస్వామి, శీన, గోపాల్, గౌరవ సలహాదారులుగా వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, చికెన్ నాగరాజు, వీరేంద్ర, శేషాద్రి, చిన్న, వై.హనుమంతు, వై.అంజి పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహం ఏర్పాటు

యాడికి : మండల పరిధిలోని నగరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. పోరుమామిళ్ల కాశినాయన మండలం ఓబులాపురం గ్రామంలో స్థాపించిన వివేకానంద ఫౌండేషన్ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, రాజోలు శ్రీధర్‌రెడ్డి, ఓబులేసు, రాజు, శ్రీనివాసరెడ్డి, యదునందనరెడ్డి, రవి, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్


పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

శింగనమల : ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించడం వెంటనే ఆపాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. నివాస గృహాలకు స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టిన దుకాణాల యజమానులు బిల్లులను చూసి గుండెలు బాదుకుంటున్నారన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రయివేటు రంగానికి అప్పగించేందుకు జరుగుతున్న కుట్రలో భాగంగానే స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారన్నారు. క్రమేణా కరెంటు కనెక్షన్ ఆదానీ చేతుల్లోకి వెళ్తుందన్నారు. కావున వెంటనే స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుంకన్న, రామాంజనేయులు, సూర్యప్రకాష్, కొండారెడ్డి, శ్రీనివాసులు, ఎర్రిస్వామి, ఆంజనేయులు, కుళ్లాయిస్వామి, నాగేంద్ర, ధన ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పెంచిన విద్యుత్ ఛార్జీలతోపాటు స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని సిపిఎం సీనియర్ నాయకులు అనమిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి ముత్యాలు, నరసింహులు, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి శివకుమార్, షాషావలి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్, శంకర, కొండాపురం కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు థియేటర్ల స్వర్ణోత్సవం

'గౌరి, గంగ, గాయత్రి, గౌతమి'కి 50 ఏళ్లు-కుటుంబ సభ్యుల సంబరాలు



కేక్ కోస్తున్న థియేటర్ యజమానులు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని గౌరి, గంగ, గాయత్రి, గౌతమి థియేటర్లు 50 ఏళ్లు పూర్తి చేసుకున్నాయి. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల సమక్షంలో థియేటర్ల ఆవరణలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ నాలుగు థియేటర్లను స్థాపించి సరిగ్గా అర్ధశతాబ్దం గడిచింది. నాటి నుంచి నేటి వరకు పట్టణవాసుల ఆదరాభిమానాలతో ఈ థియేటర్లన్నీ విజయవంతంగా నడుస్తున్నాయని వ్యవస్థాపకులు ఎస్.వెంకట నారాయణరెడ్డి, ఎస్.వన్నూరురెడ్డి, ఎస్.చిన్నవెంకటరెడ్డి, ఎస్.సీతారామిరెడ్డి, ఎస్.రామచంద్రారెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి తెలిపారు. తమ తండ్రి సానె పెద్ద వీరారెడ్డి 1971లో ఈ భూమిని కొని గౌరీ సినీ కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 1975 జూలై 4న 980 సీట్ల సామర్థ్యం, 70 ఎంఎం స్క్రీన్, విభిన్నమైన ర్యాంప్ నిర్మాణంతో గౌరీ థియేటర్ ప్రారంభమైందన్నారు. 590 సీట్ల సామర్థ్యంతో ఉన్న గంగా థియేటర్‌ను 1981 జూలై 16న ప్రారంభించారు. 700 సీట్ల సామర్థ్యం ఉన్న గాయత్రి థియేటర్‌ను 1987 డిసెంబర్ 25న, 313 సీట్ల సామర్థ్యం ఉన్న గౌతమి థియేటర్‌ను 1997 మే 2న ప్రారంభించామన్నారు. ఇప్పుడు నాలుగు థియేటర్లు కేవలం అనంతపురంలోనే కాక రాయలసీమ వాసులందరికీ సుపరిచితం అన్నారు. రాయలసీమ వాసులందరికీ వినోదాన్ని పంచుతూ ఎప్పటికప్పుడు సరికొత్త సినీ వీక్షణ అనుభవాన్ని వారికి అందిస్తూ వారి ఆదరాభిమానాలను మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, లాయర్లు ఉమాపతి, పలువురు వైద్యులు, పారిశ్రామికవేత్తలు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామి ఉత్సవాల్లో ఇబ్బందులు రానీయొద్దు

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ


క్యూలైన్‌లో భక్తులతో మాట్లాడుతున్న ఎంపి

ప్రజాశక్తి-నార్పల

గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాల్లో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లపై ఎంపి అంబికా లక్ష్మీనారాయణ శుక్రవారం గూగూడులో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా చిన్న సరిగెత్తును పురస్కరించుకుని కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాట్లపై ఆర్‌డిఒ కేశవనాయుడుతో కలిసి చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ఎంపీకి వివరించారు. ఆర్‌డిఒ కేశవనాయుడు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న అధికారులను క్యూలైన్ల వద్ద ఉంచకుండా చూడాలని, వృద్ధులు, వికలాంగులు, చిన్నపిల్లల తల్లులకు తప్ప ఎవరికీ విఐపి దర్శనాలు కల్పించవద్దని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ మమతాదేవి, ఆలయ కార్యనిర్వహణ అధికారి శోభ, ఇఒఆర్‌డి శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ జనార్ధన్, విద్యుత్ ఎఇ నీలకంఠం, మాజీ కోఆప్షన్ సభ్యులు జాఫర్‌వలి, టిడిపి నాయకులు రాజన్న, నరసింహులు, ఓబులేసు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన డీఎస్పీ

కుళ్లాయిస్వామి చిన్న సరిగెత్తు సందర్భంగా ఆలయ పరిసరాల్లో కల్పిస్తున్న భద్రతపై డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షించారు. అగ్నిగుండం సెగ భక్తులకు తాకకుండా గుడి వైపు అగ్నిగుండానికి అడ్డంగా బారికేట్లు ఏర్పాటు చేయించారు అదేవిధంగా అగ్నిగుండం చుట్టూ రోప్‌లను ఏర్పాటు చేయించారు..

అన్నదానం

కుళాయి స్వామి సన్నిధిలో నార్పలకు చెందిన గూడపురెడ్డి భాస్కర్‌రెడ్డి (థియేటర్) ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్


కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు

ప్రజాశక్తి-గుత్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమంతోపాటు అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బేతాపల్లి గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ షేక్ బర్దివలి ఆధ్వర్యంలో సూపరిపాలనలో 'తొలి అడుగు' అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. సామాజిక పింఛన్లు ఒక్కసారిగా పెంచేసి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారికి ఉచితంగా వంట గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. ఇంటిలో ఎంతమంది విద్యార్థులు ఉన్న తల్లి వందనం పథకం ద్వారా నగదు చెల్లిస్తున్నామని వివరించారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అభివృద్ధి పనులను అడ్డుకుంటే ఉపేక్షించేది లేదన్నారు. సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తే పోలీస్ శాఖ ద్వారా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, తహశీల్దార్ జి.పుణ్యమతి, ఎంపిడిఒ డి.ప్రభాకర్, టిడిపి పట్టణ కన్వీనర్ ఎంకె చౌదరి, నాయకులు జక్కలచెరువు ప్రతాప్, ఆర్.సొలమన్‌రాజా, చికెన్ శీనా, బి.రమేష్, బేతాపల్లి రంగప్ప, ఎ.గోవర్ధన్‌గౌడ్, చిన్నరెడ్డియాదవ్, కె.నాగేంద్ర, కోనంకి కృష్ణ, శ్రీనివాస్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

దగ్గుపాటి అశ్రిత ఉదారత

25 కుటుంబాలు దత్తత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పి-4 కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేందుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుమార్తె దగ్గుపాటి ఆశ్రిత ముందుకొచ్చారు. ఇందులో భాగంగా 25 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్లు దగ్గుపాటి ఫౌండేషన్ ప్రకటించింది. 25 కుటుంబాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు తాను కృషి చేస్తామని ఆశ్రిత తెలిపారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ బాలస్వామితోపాటు పీ4 బందం మొత్తం అభినందించింది. అనంతరం సిఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన స్వర్ణాంధ్ర-పీ4 ఫౌండేషన్ తొలి జనరల్ బాడీ సమావేశంలో జూమ్ ద్వారా అనంతపురం నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి పి4 ఛైర్మన్ దగ్గుపాటి ప్రసాద్, కమిషనర్ బాలస్వామి, తహశీల్దార్ హరికుమార్, ఎంపిడిఒ దివాకర్, డిప్యూటీ కమిషనర్ పావని, తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే దగ్గుపాటితో కుమార్తె అశ్రిత

ఎమ్మెల్సీ చొరవతోనే సబ్‌స్టేషన్లు మంజూరు

ఉరవకొండ : ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి చొరవతోనే విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరు అయ్యాయని విడపనకల్లు మండల వైసిపి నాయకులు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ శివరామిరెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో గడేకల్‌కు విద్యుత్ సబ్‌స్టేషన్, విడపనకల్ మండలంలో 8 ఎంవిఎ సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు అయ్యాయన్నారు. అయితే ప్రస్తుత నాయకులు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఉపకేంద్రాలను మంజూరు చేసిందని చెప్పుకోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపి రమణారెడ్డి, నాయకులు రాంబాబు, సురేష్, కాకర్ల నాగేశ్వరరావు, రమణయాదవ్, రామచంద్ర, కావలికి రామిరెడ్డి, మాలాపురం కేశన్న, గురుస్వామి, పాల్తూరు మహాలింగ, శ్రీనివాసులు, రామకృష్ణ పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థులపై దాడి హేయం

గుంతకల్లు : విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసిన మెడికల్ విద్యార్థులపై పోలీసులు దాడి చేయడం హేయమైన చర్య అని వైసిపి యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ బాషీద్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. విదేశాల్లో వైద్య విద్యను పూర్తి చేసిన విద్యార్థులు శాశ్వత రిజిస్ట్రేషన్ల కోసం విజయవాడలో ఎపి మెడికల్ కౌన్సిల్ కార్యాలయం హెల్త్ యూనివర్సిటీ ఎదుట శాంతియుతంగా నిరసన చేస్తుంటే పోలీసులు వివహరించిన తీరు బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి యువ వైద్యుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

మాజీ సిఎం కొణిజేటి రోశయ్యకు నివాళి

అనంతపురం సిటీ : మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దాసుపత్రిలో రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముడియం రమణ, రాయలసీమ రీజియన్ ఛైర్మన్ నగరూరు చంద్ర మహేష్, ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ఆర్యవైశ్య నాయకులు ప్రభాకర్, ఇల్లూరి సురేష్, మాకం సురేష్, శివ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

సమస్యల పరిష్కారానికి కార్మికుల ధర్నా

గుత్తి : సమస్యలను పరిష్కరించాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గుత్తి ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ వర్కింగ్ అధ్యక్షులు ఎంఆర్ ఆంజనేయులు, రీజినల్ కమిటీ సభ్యులు డి.హాసన్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీనే సొంతంగా కొనుగోలు చేయాలన్నారు. పెండింగ్ డిఎ బకాయిలను చెల్లించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఆరేళ్లగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గుత్తి డిపో అధ్యక్షులు ఎస్.శ్రీనివాసులు, సిసిఎస్ ప్రతినిధి పికె రాముడు, నాయకులు బి.శ్రీనివాసులు, ఎం.రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు

యాడికి : మండల కేంద్రంలోని ప్రధాన కూడలి, బస్టాండ్ ఆవరణలో చిరువ్యాపారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని ఇన్‌ఛార్జి ఇఒ శశికళ సూచించారు. ఈమేరకు శుక్రవారం బస్టాండ్ ఆవరణలో ఉన్న గంప వ్యాపారులు, అంగళ్ల నిర్వహణకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాపారులో స్వచ్ఛందంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సర్దుకున్నారు. అనంతరం మెయిన్ బజార్‌లో చెత్త సేకరణను పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్‌సతీష్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు బహుమతులు అందజేత

గుత్తి : మండలంలోని బేతాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. ముందుగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని హెచ్ఎం రంగనాథ్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గుత్తి ఆదర్శపాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కాగా గుత్తికి చెందిన గోపాల్ రూ.5వేలు, ఉపాధ్యాయుడు మాదన్న రూ.3వేలు విలువజేసే కుర్చీలను పాఠశాలకు అందించారు. దీంతో ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబుళపతి,రామకష్ణయ్య, సులోచన, శివప్రసాద్, రవీంద్రనాథ్‌రెడ్డి, నరేంద్రనాథ్‌గౌడ్, నిరుపమ, విజయకుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు సుజాత, రత్నకుమారి, సురేష్, చంద్రకళ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బెలుగుప్ప : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని ఎంపిడిఒ టి.లక్ష్మీనారాయణ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని అంకంపల్లి సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా వారు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శివరంజని, ఎపిఒ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

శింగనమల : మండల పరిధిలోని శివపురం, బండిమీదపల్లి, చక్కారాయపేట, పెరవలి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ సిడిపిఒ చల్లా లలితమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్‌ను సక్రమంగా నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కల్పన, అంగన్వాడీ టీచర్లు రమణమ్మ, ప్రసన్నరాణి, సరోజమ్మ, శ్రీదేవి, రమాదేవి, అమీదా, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవ ర్యాలీ

అనంతపురం : నగరంలోని భాష్యం విద్యాసంస్థల విద్యార్థులు శుక్రవారం వన మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ సప్తగిరి సర్కిల్ మీదుగా సాగింది. ఈ సందర్భంగా మొక్కలు నాటడంపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగారు. అనంతరం వ్యాసరచన, వకృత్వ పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ, వైస్‌ఛైర్మన్ హనుమంతరావు, డైరెక్టర్ సాకేత్ రామ్, సిఇఒ అనిల్‌కుమార్, విద్యాసంస్థల జిల్లా జెడ్ఇఒ రవివర్మ, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎపికె యాప్ లింకుల జోలికెళ్లొద్దు : ఎస్ఐ

యల్లనూరు : కిసాన్ సమ్మాన్ యోజన పథకం పేరుతో వస్తున్న ఎపికె యాప్‌ను ఓపెన్ చేయవద్దని ఎస్ఐ రామాంజనేయరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇటీవల పిఎం కిసాన్‌తోపాటు తల్లికి వందనం పేరుతో ఎపికె లింక్ చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే అన్నారు. అలాంటి యాప్‌లను ప్రజలు ఓపెన్ చేయకూడదన్నారు. ఓపెన్ చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

చెట్లను కొట్టొద్దు..

అనంతపురం సిటీ : 'మొహరం పండుగ సందర్భంగా గ్రామాల్లో చెట్లను నరకూడదని జిల్లా అటవీశాఖ అధికారి విగ్నేష్ ఒక ప్రకటనలో అన్నారు. సజీవ చెట్లను నరకకుండా బాధ్యతాయుతంగా పండుగను జరుపుకోవాలన్నారు. చెట్టు పెరుగుదలకు అంతరాయం కలగకుండా ప్రోసోపిస్ జులిఫ్లోరా (పిచ్చా కంప) కొమ్మలను మాత్రమే కత్తిరించడానికి అనుమతి ఉంటుందన్నారు.

డాక్టర్ అల్తాఫ్ పుట్టినరోజు వేడుకలు

అనంతపురం : స్థానిక సాయినగర్‌లోని డాక్టర్ అక్బర్ ఐ ఆస్పత్రి డైరెక్టర్ అల్తాఫ్ అక్బర్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అక్బర్ ఐ ఆసుపత్రి ఫౌండర్ డాక్టర్ అక్బర్ సాహెబ్ దంపతులతో కలిసి అల్తాఫ్ అక్బర్ తల్లిదండ్రుల మధ్య కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఐశ్వర్యరాణి, డాక్టర్ అక్బర్ ఐ ఆసుపత్రి సిబ్బంది జాన్, ఆరీఫ్, పెద్ద నిజాం, నిజాం, మహాలక్ష్మి, ప్రశాంతి, రాజ్యలక్ష్మి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' వివరాలు తెలుసుకోండి

పుట్లూరు : మండలంలోని రైతులు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో తమ ఆధార్ ద్వారా చెక్ చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి కాత్యాయిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులై ఉండి జాబితాలో వివరాలు లేకపోతే టోల్ ఫ్రీ నెంబర్ 155251కి ఫోన్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

ఎంఆర్‌పిఎస్‌ను బలోపేతం చేద్దాం

కళ్యాణదుర్గం టౌన్ : నూతన కమిటీల నియామకంతో ఎంఆర్‌పిఎస్‌ను బలోపేతం చేద్దామని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు హరిగోపాల్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు బండారి కదరప్ప పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో శుక్రవారం మండల కమిటీలను ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షులుగా సురేష్, అధ్యక్షులుగా ఆదినారాయణ, ఉపాధ్యక్షులుగా మంజునాథ్, అధికార ప్రతినిధిగా వంశీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ధనుంజయ, ప్రధాన కార్యదర్శిగా తిరుమలేష్, కార్యదర్శిగా అనిల్ కుమార్, సహాయ కార్యదర్శిగా గణేష్‌లను ఎన్నుకున్నారు. సమావేశంలో మండల ఇన్‌ఛార్జిలు తిమ్మరాజు, గోవిందప్ప, రమేష్, ఉమేష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు పరస్పరం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కె.ఊబిచెర్ల గ్రామానికి చెందిన మద్దిలేటి, వెంకటరాముడు పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో గుత్తికి వస్తున్నారు. ఈనేపథ్యంలో బాచుపల్లి గ్రామ శివారులో ఎన్టీపీసీ మలుపు ఎదురుగా మరో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో మద్దిలేటి, వెంకటరాముడుకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.